నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, శనివారం 8 ఫిబ్రవరి 2025 | MEDAK

కేసీఆర్, హరీశ్‌రావు కృషితోనే నీళ్లొచ్చాయి

- కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేసిన రైతులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 7: కేసీఆర్, హరీశ్‌రావు లేకుంటే తమ కల సాకారం అయ్యేది కాదని మండలంలోని మాచాపూర్, ఎల్లాయపల్లి గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని మాచాపూర్‌లో రంగనాయక సాగర్ కాలువ గట్టున కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలకు రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎల్లాయపల్లి, మాచాపూర్ రైతులు మాట్లాడుతూ.. చిన్నకోడూరు ప్రాంతంలో సాగునీటి కోసం ఏటా ఆకాశం వైపు చూసేవారమని, కేసీఆర్, హరీశ్‌రావు సహకారంతో గోదావరి జలాలు రావడంతో కరువు తొలిగిపోయిందన్నారు. వారి కృషి తోనే తమ పంటలకు నీళ్లు అందుతున్నాయని కృతజ్ఞతలు తెలిపారు. హరీశ్‌రావు చొరవ చూపి కాలువ పనులు పూర్తి చేయించడంతో గండిచెరువుకు నీళ్లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, నాయకులు కీసరి పాపయ్య, రాజారెడ్డి, మహేందర్, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కొండం రవీందర్ రెడ్డి, ముల్కల కనకరాజు రాజు, సుంచు బాబు, ఎల్లం, యాట యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మాచాపూర్‌లో కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

సత్యసాయి ట్రస్ట్ సేవలు అమోఘం

మాజీ క్రికెటర్, పద్మశ్రీ వీవీఎస్ లక్ష్మణ్

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 7: మానవత్వమే సత్యసాయి ప్రథమ లక్ష్యమని భారత మాజీ క్రికెటర్, పద్మశ్రీ వంగీపురం వెంకటసాయి లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక శివారులోని సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాయి సంజీవని చైల్డ్ హార్ట్‌కేర్ సెంటర్‌ను శుక్రవారం ట్రస్ట్ చైర్మన్‌తో ఆయన కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. సాయి సంజీవని చైల్డ్ హార్ట్‌కేర్ ద్వారా ఇప్పటికే 50 మందికి పైగా చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేసి ప్రాణాలను కాపాడారన్నారు. గ్రామీణ ప్రాంత చిన్నారులకు సాయి సంజీవని చైల్డ్ హార్ట్‌కేర్ ఒక వరమన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా ఇప్పటికే 50వేల మందికి వైద్యసేవలు అందడం గొప్ప విషయమన్నారు. సత్యసాయి సేవలు విశ్వవ్యాప్తం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వంశీ కృష్ణ, సూర్యనారాయణన్ పాణిగ్రహి, డాక్టర్ రాగిణి జగన్నాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీవీఎస్ లక్ష్మణ్

సాగుకు సాంకేతికత తోడవ్వాలి

తోర్నాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, ఫిబ్రవరి 7: వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని రైతులకు మంచి దిగుబడులు సాధించి అధిక ఆదాయం పొందాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి పిలుపునిచ్చారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామ పరిధిలో గల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్ శ్రీదేవి కలెక్టర్‌కు ఘనస్వాగతం పలికి అన్ని వివరాలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. దేశ జనాభాలో అధిక శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాల్లోనే ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ సేద్యం, మైక్రో ఇరిగేషన్ సిస్టమ్స్ ద్వారా నీటి నిర్వహణ సహా సమగ్ర నీటి నిర్వహణ కార్యకలాపాలు, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. రైతులకు మేలు చేసేలా కాలానుణంగా పరిశోధనలు చేయాలన్నారు. వ్యవసాయ విద్యార్థులు కోర్సులు విజయంతంగా పూర్తిచేసి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు.

అనాథలుగా మారిన చిన్నారులు

వట్‌పల్లి, ఫిబ్రవరి 7: మెదక్ జిల్లా వట్‌పల్లి మండలం కేరూర్ గ్రామానికి చెందిన భూదమ్మ (37) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో ఆమె ఇద్దరు కుమార్తెలు భాగ్య, భార్గవి అనాథలుగా మారారు. భూదమ్మ భర్త గతంలోనే మృతిచెందడంతో కూలీ పనులు చేసుకుంటూ తన ఇద్దరు పిల్లలను పోషించింది. ఇప్పుడు ఆమె మృతిచెందడంతో చిన్నారుల ఆలనా పాలన చూసేవారు కరువయ్యారు. అనాథలుగా మారిన చిన్నా రులను ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనాథలుగా మారిన చిన్నారులు

కొనుగోలుమాల్!

దళారులతో హుస్నాబాద్ మండల వ్యవసాయాధికారి కుమ్మక్కు

- పత్తి సాగుచేసినట్లు వ్యాపారులకు ధ్రువీకరణ పత్రాలు జారీ
- ఏఈవోల సంతకాలు ఫోర్జరీ
- సీసీఐ మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ అధికారి చేతివాటం
- ఏడీఏకు,జిల్లా వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేసిన ఏఈవోలు
- చర్యలు తీసుకోని జిల్లా అధికారులు
- పూర్తిస్థాయిలో విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం

సిద్దిపేట, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి): పత్తి పంట సాగు చేయకున్నా చేసినట్లు ఏఈవోల సంతకాలను ఫోర్జరీ చేసి, దళారులతో కుమ్మక్కై వ్యాపారుల పేరు మీద కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కి పత్తి ధ్రువీకరణ పత్రాలు రాసిచ్చిన హుస్నాబాద్ మండల వ్యవసాయాధికారి ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. సీసీఐ మార్కెటింగ్ అధికారులు, మండల వ్యవసాయ అధికారి దళారులతో చేయి కలిపి అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. పత్తి కొనుగోలు వెనుక లక్షల రూపాయల అక్రమాలు జరిగాయి. ఈ విషయం జిల్లా స్థాయి అధికారులకు తెలిసిన మౌనంగా ఉండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కుంభకోణంలో ఎవరికి ఎంత వాటాలు ఉన్నాయో ..? అని రైతులు చర్చించుకుంటున్నారు. వివరాలలోకి వెళ్తే... సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలో గత వానకాలంలో 6వేల ఎకరాల్లో రైతులు పత్తిని సాగుచేశారు. సాగు వివరాలను ఏఈవోలు వారి క్లస్టర్ వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇటీవల పత్తి పంట చేతికి రాగా ప్రభుత్వం పత్తి సేకరణకు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది. సాగుచేసిన పత్తిని విక్రయానికి సీసీఐ కేంద్రానికి రైతులు తీసుకుపోయే ముందు స్థానిక ఏఈవో వద్ద సాగు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుపోవాల్సి ఉంటుంది. రైతు వివరాలను ఆన్‌లైన్‌లో చూసి ఏఈవో ధ్రువీకరణ పత్రాన్ని రాసి టోకెన్ ఇస్తాడు. దానిని తీసుకుపోయి సీసీఐ కేంద్రంలో రైతు తమ పత్తి పంటను అమ్ముకోవాల్సి ఉంటుంది. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది. కానీ, హుస్నాబాద్ మండల వ్యవసాయాధికారి కాసులకు కక్కుర్తి పడి దళారులతో చేతులు కలిపినట్లు తెలిసింది. అప్పటికే పత్తిని కొనుగోలు చేసిన వ్యాపారులకు పంట సాగుచేసినట్లు ఏఈవోలకు సమాచారం లేకుండానే ధ్రువీకరణ పత్రాలపై ఫోర్జరీ సంతకాలు చేసి ఆయన టోకెన్లు జారీచేశాడు. సుమారు 300ఎకరాలకు పైగా ఫోర్జరీ సంతకాలు చేసి ధ్రువీకరణ పత్రాలు వ్యాపారులకు రాసిచ్చాడు. ఈ తతంగంలో మార్కెటింగ్‌లో ఉన్న ఇంకో అధికారితో చేతులు కలిపి ఇద్దరు కలిసి ఈ వ్యవహారాన్ని దళారులతో కలిసి నడిపించారని ఆరోపణలు ఉన్నాయి. రైతుల దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసిన పత్తిని తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో వ్యాపారులు సీసీఐ కేంద్రంలో విక్రయించి సొమ్ము చేసుకున్నారు. రైతుల వద్ద క్వింటాల్‌కు రూ. 6,200 వరకు కొనుగోలు చేసి, సీసీఐ కేంద్రంలో క్వింటాల్‌కు రూ. 7,500 వరకు అమ్మి సుమారు రూ. 50 లక్షల పైగానే సొమ్ముచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

గుట్టు రట్టైంది ఇలా...

హుస్నాబాద్ మండలానికి చెందిన ఒక నాయకుడు పత్తి కొనుగోలు ధ్రువీకరణ పత్రం కోసం ఇటీవల సంబంధిత ఏఈవోను కలిశారు. తమ గ్రామానికి చెందిన ఒక వ్యాపారికి పత్తి పంట సాగు ధ్రువీకరణ పత్రం రాసివ్వాలని అతను అడిగారు. దీంతో ఆ రైతు వివరాలను ఆన్‌లైన్‌లో చూస్తే పత్తి పంట సాగు చేసినట్లు వివరాలు లేవు. ఒకవేళ ఆన్‌లైన్‌లో రైతు వివరాలు లేకపోతే ఫీల్డ్‌కు వెళ్లి ఫిజికల్‌గా పంట సాగు చేశారా? లేదా? అని ధ్రువీకరించి ఈ రైతుకు టోకెన్ ఇవ్వాలి. కానీ, ఆ నాయకుడు తీసుకు వచ్చిన వ్యాపారి పేరు మీద ఆన్‌లైన్‌లోగానీ, ఫిజికల్‌గా గానీ పత్తి పంట సాగుచేసినట్లు లేదు. పంట వేయలేదు కాబట్టి తాను రాసివ్వనని ఏఈవో సదరు నాయకుడికి సమాధానం చెప్పారు. దీంతో మీరు ఇదే గ్రామంలో పత్తి పంట సాగుచేయని వారికి సైతం రాసిచ్చారని, వారికి రాసిచ్చినప్పుడు ఇతనికి ఎందుకు రాసివ్వవని, తమ దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయని ప్రశ్నించాడు. దీంతో స్పందించిన ఏఈవో తాను ఎవరికి అలా రాసివ్వలేదని, ఆధారాలు ఉంటే చూపించాలని అడిగారు. వెంటనే సదరు నాయకుడు ఆయన వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాన్ని చూపించడంతో ఏఈవో అవాక్కయ్యాడు. ఇది ఫోర్జరీ సంతకం అని తెలుసుకొని మిగతా ఏఈవోలకు సమాచారం ఇచ్చాడు. ఇలా ఒక క్లస్టరే కాకుండా హుస్నాబాద్ మండలంలోని అన్ని క్లస్టర్లలో ఈ ఫోర్జరీ సంతకాలు వెలుగుచూశాయి. అప్పటికే సీసీఐ వాళ్లతో మాట్లాడుకొని ముందే తెచ్చుకున్న టోకెన్ బుక్‌లో హుస్నాబాద్ మండల వ్యవసాయాధికారి తన కింది స్థాయి అధికారుల (ఏఈవోలు) సంతకాలు ఫోర్జరీ చేసి వ్యాపారులకు టోకెన్ ఇచ్చినట్లు బయటపడింది. తాము చేయని తప్పుకు తమను బలిచేశావంటూ మండల ఏఈవోలు ఏవోను నిలదీశారు. ఫోర్జరీ చేసిన మాట వాస్తవమేనని, ఒక 30 మంది వరకు ధ్రువీకరణ పత్రాలను రాసిచ్చానని, ఏం జరిగినా తానే బాధ్యుడిని అంటూ ఏఈవోలకు ఏవో లెటర్ రాసిచ్చారని సమాచారం. ఇదే విషయాన్ని సైతం ఏఈవోలు వాళ్ల పైస్థాయి అధికారులైన ఏడీఏకు, జిల్లా వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అయితే ఈ వ్యవహారంపై జిల్లాస్థాయి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మింగలేక కక్కలేక కాంగ్రెస్ నేతల సతమతం

గుమ్మడిదల, ఫిబ్రవరి 7: డంపింగ్ యార్డు ఏర్పాటును బహిరంగంగా వ్యతిరేకించలేక, తమ ప్రభుత్వ నిర్ణయాన్ని కాదనలేక సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల, జిన్నారం మండలాల కాంగ్రెస్ నాయకులు మథన పడుతున్నారు. డంపింగ్ యార్డు వద్దే వద్దంటూ ప్రజలు పెద్దఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడుతుండడంతో హస్తం నేతలు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై ఏమి సమాధానం చెప్పలేక బీఆర్ఎస్ నాయకులపై దుమ్మెత్తి పోస్తున్నారు. మీ పాలనలోనే డంపింగ్ యార్డుకు బీజం పడిందని ఆరోపిస్తున్నారు. కానీ, బాధిత గ్రామాలకు అండగా సంఘీభావం తెలుపలేని సంకట స్థితిలో కాంగ్రెస్ నాయకులు కొట్టుమిట్టాడుతున్నారు. శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగ్‌రావు అధ్యక్షతన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. దీనికి గుమ్మడిదల, జిన్నారం మండలాల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వడ్డె కృష్ణతో పాటు పలు గ్రామాల కాంగ్రెస్ శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము కూడా డంపింగ్ యార్డుకు వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, స్థానికులతో కలిసి డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. డంపింగ్ యార్డు పనులు నిలిపివేయడానికి తాము మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి విన్నవిస్తామని తెలిపారు. అందరూ కలిసి పోరాడితేనే పనులు నిలిపి వేయవచ్చని సూచించారు. డంపింగ్ యార్డు పనులు నిలిపి వేయడానికి ప్రణాళికను రూపిందిస్తామని పేర్కొన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జంగారెడ్డి, అంజద్, గ్యారల మల్లేశ్, కుమ్మరి వెంకటేశ్, లక్ష్మారెడ్డి, నారబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లారీ, కారు ఢీ

- ఇద్దరు మృతి.. ఇద్దరికి గాయాలు

గజ్వేల్, ఫిబ్రవరి 7: ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన రాజీవ్ రహదారి సమీపంలో ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం పోరాట్‌పల్లికి చెందిన పెయింటర్ మెరుగు లింగయ్య(52), అదే గ్రామానికి చెందిన ఎన్టీపీసీ ఉద్యోగి మిస్టే బినేశ్(29), లింగయ్య తమ్ముడు మహేశ్ కారు కిరాయి తీసుకొని హైదరాబాద్‌కు గురువారం అర్ధరాత్రి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు రాజీవ్ రహదారి సమీపంలోని ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో కారులో ఉన్న లింగయ్య, బినేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. అందులో నుంచి మృతదేహాలను కట్టర్ సాయంతో వెలికితీశారు. మహేశ్, డ్రైవర్ ప్రణయ్‌సాయికి తీవ్ర గాయాలు కావడంతో వారిని పోలీసులు చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘటనా స్థలి దృశ్యం

అన్యాయాన్ని సహించం

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీల ఆగ్రహం

ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించిన కులగణన సర్వేపై బీసీలు మండిపడుతున్నారు. తమ జనాభాను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తగ్గించి చూపెట్టిందని బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవకాశాల్లో, అధికారంలో న్యాయమైన వాటా కోసం కొట్లాడుతున్న తమకు ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటి సర్వే పేరుతో ప్రభుత్వం నిర్వహించిన కులగణన ఫలితాలు మొదటికే మోసం వచ్చేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జనాభాలో తాము 60 శాతానికి పైబడి ఉన్నామని, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా తమకు కనీసం 42శాతం కోటా అయినా ఇవ్వాలని డిమాండ్ చేస్తుంటే, 60శాతం లేరని కాంగ్రెస్ సర్కారు తన సర్వేతో తేల్చిపారేయడం తమనెంతో బాధించిందని బీసీలు ఆవేదన చెందుతున్నారు. తమకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. తమ న్యాయమైన వాటాను ఇవ్వడం ఇష్టంలేక సీఎం రేవంత్ డ్రామాలు ఆడుతున్నారని బీసీ నాయకులు మండిపడుతున్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ ఉమ్మడి మెదక్ జిల్లా, ఫిబ్రవరి 7



బీసీలపై కాంగ్రెస్ కుట్ర

రామాయంపేట, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ సర్కార్ కులగణన సర్వే తప్పుల తడకగా చేయించింది. 60 శాతం ఉన్న బీసీలను కేవలం 42 శాతమే ఉన్నట్లు సర్వేలో చూపింది. దీనివెనుక కాంగ్రెస్ సర్కారు కుట్ర దాగి ఉన్నది. రాబోయే ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లను పెంచాల్సి వస్తదని తూతూ మంత్రంగా సర్వేలు చేయించింది. బీసీలు మరో ఉద్యమం చేపట్టాలి. బీసీలంతా ఏకమై ఉద్యమం చేద్దాం. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో 52శాతం రిజర్వేషన్లు కల్పించాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల కోటా బీసీలకు దక్కాలి. లేకపోతే పోరాటం తప్పదు.

–ర్యాకల శేఖర్‌గౌడ్, రాష్ట్ర గీత కార్మిక సంఘం నాయకుడు, మనోహరాబాద్.

సీఎం ప్రకటన హాస్యాస్పదం

చేర్యాల, ఫిబ్రవరి 7: సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో బీసీ కులగణనపై తీర్మానం చేయకుండా చేసినట్లు బిల్డప్ ఇచ్చారు. 42శాతం రిజర్వేషన్లు సాధ్యం కాకపోతే పార్టీ పరంగా 42శాతం టికెట్లు ఇస్తామనడం హాస్యాస్పదం. పార్టీపరమైన విషయాలను అసెంబ్లీలో ఎందుకు ప్రకటించాలి. కులగణన సక్రమంగా జరగలేదు. రీసర్వే చేసి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అగ్రవర్ణాల జనాభా లెక్కలు ఎక్కువ చూపి బీసీల లెక్కలు తక్కువ చూపడం ఎంతమేరకు సమంజసం. కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతాం.

– పచ్చిమడ్ల మానసగౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్, చేర్యాల (సిద్దిపేట జిల్లా)

కాంగ్రెస్ బీసీల వ్యతిరేకం

రామాయంపేట, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ సర్కారు బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది. ఏరుదాటేదాకా ఓడమల్లన్న ఏరుదాటినాక బోడ మల్లన్న అన్నట్టు ఉంది కాంగ్రెస్ సర్కార్ కులగణన తీరు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీలకు సమగ్ర న్యాయం చేస్తామంటూ గొప్పలు చెప్పిన రేవంత్ సర్కార్ ఇప్పుడు మాటమార్చి మొండిచేయి చూపడం సరికాదు. రాష్ట్రంలో బీసీల జనాభా పెరగలేదని చెప్ప డం కేవలం కాంగ్రెస్ సర్కార్‌కే చెల్లింది. దీని వెనక పెద్ద కుట్ర దాగి ఉన్నట్లు కనిపిస్తుంది.

– బి.సత్యనారాయణగౌడ్, గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు, తూప్రాన్

సర్వే లోపభూయిష్టం..

కాంగ్రెస్ సర్కారు చేయించిన కులగణన సర్వే లోపభూయిష్టంగా ఉంది. జనాభా లెక్కలు తప్పుల తడకగా ఉన్నాయి. బీసీలకు అన్యాయం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. బీసీల జనాభా తక్కువ చేసి చూపించి ఆవర్గాలకు తగిన ఫలాలు అందకుండా ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. ప్రభుత్వం గందరగోళాన్ని క్రియేట్ చేసి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు అన్యాయం చేసేలా సర్వే చేయించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి. రేవంత్‌రెడ్డికి నిజంగా 42శాతం శాతమే రిజర్వేషన్ ఇవ్వాలని చిత్తశుద్ధి ఉంటే క్యాబినెట్ విస్తరణలో 42శాతం బీసీలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

– శ్రీహరి యాదవ్, గొర్రెల కాపరుల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు (సిద్దిపేట)

కులగణన తప్పుల తడక

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన బీసీ కులగణన తప్పుల తడక. ప్రభుత్వం లెక్క లు మార్చి తప్పుగా చూపి వాస్తవ లెక్కలను విస్మరించింది. 60శాతం ఉన్న బీసీలను 46 శాతానికి పరిమితం చేయడం శోచనీయం. తెలంగాణలో 3.35 కోట్ల మంది బీసీ ఓటర్లు ఉన్నారని ఎన్నికల కమిషన్ చెబుతుంటే, సర్వేలో మాత్రం రాష్ట్ర జనాభా 3.54 కోట్ల చూపడం నమ్మశక్యంగా లేదు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అధికంగా సీట్లు ఇవ్వాల్సి వస్తుందని తప్పుడు లెక్కలు చూపించింది. పదేండ్ల క్రితం సమగ్ర కుటుంబ సర్వేలో 52శాతం బీసీలు ఉన్నారని బీఆర్ఎస్ ప్రభుత్వం లెక్కలు తీస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 46 శాతం ఉన్నారని చెప్పడం దారుణం. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పడానికి బీసీలు సిద్ధంగా ఉండాలి.

– ముదిగొండ శ్రీనివాస్, బీఆర్ఎస్ బీసీ సెల్ కోఆర్డినేటర్, సిద్దిపేట

తూతూమంత్రంగా చేపట్టారు..

కొమురవెల్లి, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ ప్రభుత్వం తూతూమంత్రంగా బీసీ కులగణన చేసింది. పారదర్శకత పాటించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రోజులో చేపట్టిన సర్వేను గమనిస్తే...ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే మొత్తం తప్పుల తడక అని అర్థమవుతుంది. కాంగ్రెస్ నాయకులే ప్రభుత్వం చేసిన సర్వే కరెక్ట్‌గా లేదని చెబుతున్నారు. కానీ, ప్రభుత్వం ప్రజల చెవిలో పువ్వులు పెట్టాలని చూస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం బీసీలను అణగదొక్కే విధంగా ఫేక్ సర్వే చేయించింది. కాంగ్రెస్ చేపట్టిన సర్వే అగ్రకులాల సర్వేలాగా ఉంది. ఇలాంటి సర్వేలతో బీసీల ఆత్మగౌరవం దెబ్బతింటుంది. ప్రభుత్వం మరోసారి పారదర్శకంగా సర్వే చేయించాలి. ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి.

–కొండపాక కనకయ్య, బీసీ సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, కొమురవెల్లి

మళ్లీ సర్వే చేయించాలి..

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 7: బీసీల జనాభాను తక్కువచేసి చూపించడం ప్రభుత్వం చేసిన దుర్మార్గమైన చర్యగా బీసీలు భావిస్తున్నారు. ఇలాం టి చర్యలు బీసీల హక్కులను కాలరాయడమే. తక్షణమే కులగణను రద్దుచేసి తిరిగి సర్వే చేయించి బీసీలకు న్యాయం చేయాలి. కేవలం ఒక వర్గానికి మేలు చేసే విధంగా కులగణన చేసిన విషయం స్పష్టంగా తెలుస్తున్నది. బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం కులగణనలో బీసీల సంఖ్య తగ్గించిన విషయంపై మాట్లాడకపోవడం సరికాదు.

– కొమురయ్య, తెలంగాణ కల్లుగీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు, సిద్దిపేట

గ్రామాల వారీగా బీసీ జనాభా ప్రకటించాలి..

రామాయంపేట, ఫిబ్రవరి 7: రాష్ట్ర జనాభాలో బీసీలు 60శాతం పైనే ఉన్నారు. ప్రభుత్వం బీసీ జనాభాను తక్కువగా చూపి స్థానిక ఎన్నికల్లో అన్యా యం చేయాలని చూస్తున్నది. గ్రామాల వారీగా బీసీ జనాభాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి. 56శాతం బీసీలు ఉన్నట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో తేలింది. ప్రస్తుత ప్రభుత్వం బీసీల జనాభా 46 శాతంగా చూపడం సరికాదు. బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే ఓటుతో బుద్ధితో చెబుతాం.

– మ్యాకల జయరాములు, పద్మశాలి సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు

బీసీలకు న్యాయం చేయాలి..

రామాయంపేట, ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు న్యాయం చేయాలి. సర్వేలో తీవ్ర అన్యాయం జరిగింది. సమగ్ర కులగణన సర్వే జాతీయ స్థాయిలో చేపట్టాలి. దేశంలో అధికంగా ఉన్న బీసీలకు అన్నిరంగాల్లో అన్యాయం జరుగుతున్నది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు జనాభా కోటా ప్రకారం న్యాయం చేయాలి.

–మెట్టు గంగారాం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, మెదక్

బీసీలకు తగిన వాటా దక్కాలి..

రామాయంపేట, ఫిబ్రవరి 7: బీసీల జనాభా తక్కువగా చూపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సరికాదు. ప్రభుత్వం సరిగ్గా సర్వే చేపట్టలేదు. బీసీలు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారు. బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోం. బీసీలు తిరగబడితే ప్రభుత్వం పతనం ఖాయం. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు తగిన వాటా దక్కాలి.

– సంగు స్వామి, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు, మెదక్